సాక్షి వికారాబాద్

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



గుంతల దారి..

అడుగడుగునా ఏర్పడిన గుంతలతో దౌల్తాబాద్‌–బిచ్చాల రోడ్డు అధ్వానంగా మారింది.

10లో



ప్రతి హామీని నెరవేరుస్తాం

అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

10లో



అర్హులకు పంట రుణం

అర్హులైన ప్రతీ రైతుకు పంట రుణం మంజూరు చేయనున్నట్లు తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

11లో

‘సీజనల్’.. కిటకిట

- ఓపీలకు భారీగా పెరిగిన రద్దీ
- మందులు లేక ఇబ్బంది
- సమయపాలన పాటించని వైద్యులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ పాలకులు పదేపదే చెబుతున్నా క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో దవాఖానాల్లో రోగుల రద్దీ తీవ్రమైంది. ఇందుకు తగ్గట్టు వైద్యులు, సిబ్బంది, మందులు లేక జనం ఇబ్బంది పడుతున్నారు.

సాక్షి విజిట్



అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఓపీ చీటీలకు బారులు తీరిన రోగులు

ఫార్మసిస్ట్‌గా స్టాఫ్‌నర్స్



వైద్యం కోసం వచ్చిన ప్రజలు

తాండూరు టౌన్: పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందిచాలనే ఉద్దేశ్యంతో పాత తాండూరులో బస్తీ దవాఖాన, ఇందిరానగర్‌లో అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటు చేశారు. బస్తీ దవాఖానలో వైద్యుడు లేకపోవడంతో డిప్యూటేషన్‌పై డాక్టర్లు వస్తున్నారు. నిత్యం 150మంది వరకు రోగులు వస్తుంటారు. రక్త నమూనాలు సేకరించి పరీక్షల అనంతరం డాక్టర్లు రాసే మందులు లభించడం లేదు. ఫార్మసిస్ట్ ఉండరు, స్టాక్ అందుబాటులో ఉండదు. ఇక్కడ పనిచేసే స్టాఫ్ నర్స్‌కు ఫార్మసిస్ట్ బాధ్యతలు అప్పగించారు. సరైన వెద్యం అందడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత వైద్యుడు లేదు



కొన్ని నెలలుగా ఇక్కడ శాశ్వత వైద్యుడు లేడు. ఎవరో ఒకరు వచ్చి వైద్యం చేస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మందులు, ఇంజక్షన్లు లేవు. అక్కడ అందుబాటులో ఉన్న నాలుగైదు రకాల గోళీలనే అందరికీ ఇస్తున్నారు. అధికారులు స్పందించి మందులు అందుబాటులో ఉండేలా చూడాలి.

– అబ్దుల్ నయీమ్, పాత తాండూరు

ఫీవర్ బాధితులే ఎక్కువ



వర్షాలు ఎక్కువగా కురియడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వైరల్ ఫీవర్, టైఫాయిడ్‌తో ప్రజలు వైద్యం కోసం వస్తున్నారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై వచ్చాను. అందుబాటులో ఉన్న మందులు, ఇంజక్షన్లు రోగులకు ఇస్తున్నాం. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

– డాక్టర్ అక్షయ్, బస్తీ దవాఖాన, పాతతాండూరు

అరకొర వైద్యం!

మధ్యాహ్నం 12 గంటలలోపే ఓపీ క్లోజ్

తాండూరు: పేదలకు వైద్యం అందించే విషయంలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చిన వారికి కూర్చునేందుకు కుర్చీలు లేవు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఓపీలో వైద్యం అందించాల్సిన వైద్యులు ఉదయం 10గంటలకు వచ్చి మధ్యాహ్నం 12గంటలకే వెళ్లిపోతున్నారు. జిల్లా ప్రభుత్వాస్పత్రి, మాతాశిశు ఆస్పత్రులను శుక్రవారం సాక్షి విజిట్ చేసింది. ఉదయం 10 గంటల తర్వాత వచ్చిన వైద్యులు రోగిని ముట్టుకోకుండానే మందులు రాసి పంపించారు. మరోవైపు పలు విభాగాలకు చెందిన వైద్యులు విధులకు రాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. జిల్లా ఆసుపత్రిలోని ఓ విభాగంలో 12 గంటల సమయంలో వైద్య సిబ్బంది రోగులకు వైద్య సేవలు అందించకుండా ఒకే చోట చేరి సెల్ ఫోన్‌లు చూస్తూ ముచ్చటించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంలో బిజీగా కనిపించారు. ఓపీ క్లోజ్ చేయడంతో అత్యవసర వైద్య విభాగం ఎదుట రోగులు వైద్యం పొందేందుకు క్యూ కట్టారు.

నేలపై కూర్చుని పడిగాపులు

మాతా శిశు ఆసుపత్రి వైద్య సేవలు దారుణంగా కనిపించాయి. ఎంసీహెచ్‌లో వైద్యులు ఓపీ సేవలను త్వరగా క్లోజ్ చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైరల్ ఫీవర్, పలు రకాల జబ్బులతో పసి పిల్లలతో వచ్చిన తల్లి బిడ్డలకు వైద్య సేవలను అందక ఇబ్బందులు పడ్డారు. పసి పిల్లలతో వచ్చిన తల్లులకు కూర్చునేందుకు కుర్చీలు అందుబాటులో లేక నిల్చోవడం.. నేలపై కూర్చొని పడిగాపులు కాశారు. చిన్నారులకు వైద్య సేవలు అందించే డ్యూటీ డాక్టర్ తల్లి బిడ్డలను నిలబెట్టి వైద్యం అందించారు.



ఎమర్జెన్సీ విభాగంలో వేచి ఉన్న రోగులు



ఒక్కచోట చేరి ముచ్చట్లు పెడుతున్న సిబ్బంది

నర్సులతోనే వైద్య సేవలు

బంట్వారం: బంట్వారం, కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయ పాలన పాటించడం లేదు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాల్సి ఉన్నప్పటికీ సక్రమంగా విధులు నిర్వహించడం లేదు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా వచ్చి పోతున్నారు. కోట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్కోసారి మధ్యాహ్నం 2 గంటలకే తాళం వేసి వెళ్లిపోతున్నారు. బంట్వారం, కోట్‌పల్లి పీహెచ్‌సీలో సమయపాలన లేదు. దీంతో రోగులు ఆస్పత్రులకు వెళ్లి గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కింది స్థాయి సిబ్బందే వైద్యం చేసి పంపిస్తున్నారు. ఆసుపత్రికి వెళ్లిన రోగులకు మొదటగా డాక్టర్ పరీక్షించి చీటీ రాసాకే సిబ్బంది అవసరమైన ఇంజెక్షన్లు, మందులు ఇవ్వాల్సి ఉంటుంది. కాని డాక్టర్లు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో డ్యూటీలో ఉన్న నర్సులే రోగులకు వైద్యం చేస్తున్నారు. కోట్‌పల్లి పీహెచ్‌సీలో శుక్రవారం ఉదయం 11:15 గంటలు దాటినా డాక్టర్ కుర్చీ ఖాళీగానే కనిపించింది. విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సు రోగులకు వైద్యం చేసి పంపించింది. బంట్వారం పీహెచ్‌సీలో డాక్టర్ మానస విధుల్లో కనిపించింది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నప్పటికి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం రోగులకు సరైన వైద్యం అందడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



కోట్‌పల్లి పీహెచ్‌సీలో 11:15గంటలకు ఖాళీగా కనిపిస్తున్న కుర్చీ



బంట్వారం పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మానస

నూతన భవనం.. అధునాతన వైద్యం

మోమిన్‌పేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు బయటి రోగులు 120నుంచి 150వరకు వస్తున్నారు. సీజనల్ జ్వరంతో బాధపడుతున్న కేసులే ఎక్కువగా ఉన్నాయి. వెంటనే రక్తపరీక్ష చేసి అవసరమైన మందులు ఇస్తున్నారు. టైఫాయిడ్, డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ముగ్గురు ఉండాల్సిన వైద్యులలో ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 5గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటున్నారని రోగులు తెలిపారు. ఇజ్రాచిట్టంపల్లికి నుంచి వచ్చిన రోగులు సంగీత, రుక్కిభాయిలకు టైఫాయిడ్ రావడంతో ఇక్కడే చికిత్స చేశారన్నారు. సెలైన్‌లు పెట్టారని చెప్పారు. డాక్టరులు బాగానే చూస్తున్నారన్నారు. నూతన భవనం కావడంతో అన్ని రకాల వసతులు కల్పించారు.

విధుల్లో ఒక్కరే..

కుల్కచర్ల: సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నందున రోగులు ప్రభుత్వాస్పత్రులకు క్యూ కడుతున్నారు. రోజు సుమారుగా 80మందికి పైగా ఓపీ చెకప్‌నకు వస్తున్నారు. సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో 120మందికిపైగా వస్తున్నారు. ప్రస్తుతం కుల్కచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. మరొక మెడికల్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. రాత్రి ఏఎన్ఎం మాత్రమే ఉంటున్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో లేక ఒకింత ఇబ్బంది పడుతున్నారు.

డాక్టర్ వస్తారా..? లేదా..?

- ఆస్పత్రి సిబ్బందిని నిలదీసిన రోగులు
- ఐదేళ్లుగా నీటి కొరత

ధారూరు: ధారూరు, నాగసమందర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులున్నా.. వైద్యులు కరువయ్యారు. డాక్టర్ల స్థానంలో రెండు పీహెచ్‌సీలలో ఎంహెచ్ఎల్‌పీలు వైద్యులుగా కొనసాగుతున్నారు. ధారూరు వైద్య దంపతులు బదిలీపై వెళ్లగా.. నాగసమందర్ డాక్టర్ సెలవులో ఉన్నారు. కాగా ఆస్పత్రికి వచ్చిన రోగులు డాక్టర్ వస్తారా.? లేదా అని సిబ్బందిని నిలదీశారు. శుక్రవారం ధారూరు పీహెచ్‌సీని పరిశీలించగా మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ 10:32 గంటలకు వచ్చారు. సిబ్బంది సైతం అదే సమయాన్ని పాటించారు. వీరు వచ్చేవరకు ల్యాబ్ టెక్నీషియన్, నేచురోపతి ఆస్పత్రి అటెండర్‌లు మాత్రమే ఉన్నారు. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్‌లు డాక్టర్ల మాదిరిగానే రోగులకు సేవలందిస్తున్నారు. టైఫాయిడ్‌తో బాధపడుతున్న బాధితులు ఎక్కువగా ఉన్నారు. వీరికి ఇంజెక్షన్లు ఇవ్వాల్సిన స్టాఫ్‌నర్స్ లేకపోవడంతో వంతుల వారిగా సబ్ సెంటర్ల ఏఎన్ఎంలు వచ్చి వెళ్తున్నారు.

ఐదేళ్లుగా నీటి కొరత

ధారూరు పీహెచ్‌సీలో ఐదేళ్లుగా నీటి కొరత ఉందని రోగులు వాపోయారు. ఇక్కడ వాష్‌రూం వినియోగం లేదని, కనీసం తాగేందుకు నీరు లేకపోవడం, సిబ్బంది తెప్పించుకుంటున్న బబుల్ వాటర్‌ను కొద్దిగా ఇస్తే తాగుతున్నామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్‌కు అవసరమైన నీరు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు.



నాగసమందర్ పీహెచ్‌సీలో సిబ్బందిని నిలదీస్తున్న మహిళలు



ధారూరు పీహెచ్‌సీలో ఉదయం 10:32 గంటలకు ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీ



నాగసమందర్‌లో బీపీ చెక్ చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ శివకుమార్

300మందికి పైగా ఓపీ

కొడంగల్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోజుకు 300 మందికి పైగా రోగులు వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కువగా సీజనల్ వ్యాధులతో ఓపీ పెరిగిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రప్రియ తెలిపారు. వైద్యులు, సిబ్బంది 24గంటల పాటు అందుబాటులో ఉంటున్నారని దగ్గు, జ్వరం, కడుపునొప్పి, జలుబు తదితర లక్షణాలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆసుపత్రిలో చిన్న పిల్లల డాక్టర్ జయదీప్‌రెడ్డి, అనస్తీషియా డాక్టర్ సాకేత్, డాక్టర్లు మైమూనా, పూజ, శ్రావణి, శివ తదితరులు ఆస్పత్రిలో సేవలు అందిస్తున్నారని చెప్పారు. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. గైనకాలజిస్టు లేనందున సిజేరియన్లు చేయడం లేదు.



కొడంగల్: నిరీక్షిస్తున్న రోగులు

సమయపాలన.. మందులు కరువు

పెద్దేముల్: పెద్దేముల్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు సమయపాలన పాటించడం లేదు. శుక్రవారం ఉదయం 9గంటలకు ‘సాక్షి’ ఆస్పత్రి విజిట్‌కు వెళ్లగా 9.30గంటల తర్వాత డాక్టర్ వెంకట్‌సాయి, పలువురు సిబ్బంది వచ్చారు. అప్పటి వరకు మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) డాక్టర్ ప్రమోద్ కుమార్ రోగులను పరీక్షించారు. ఇంజక్షన్లు, సిరప్‌లు, ఐరన్ మాత్రలు కొరత ఉన్నట్లు తెలిసింది. రోజుకు వందకు పైగా ఓపీ వస్తుందని డాక్టర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మందుల కోసం ఇండెంట్ పంపించామన్నారు.



డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

డాక్టర్ డబ్బుతో ఇంజెక్షన్లు

దౌల్తాబాద్: దౌల్తాబాద్ పీహెచ్‌సీలో వైద్యం దయనీయంగా మారింది. ప్రతీ రోజు సుమారు వంద మంది వరకు ఓపీ వస్తుంది. ఇక్కడ ఇద్దరు వైద్యులే అందుబాటులో ఉండడంతో వారు షిఫ్టులవారీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆరు నెలలుగా ఇంజక్షన్ల సరఫరా లేకపోవడంతో ఇక్కడ పని చేసే డాక్టర్ సొంత డబ్బు వెచ్చించి చికిత్సలు అందిస్తున్నారు. స్టాఫ్ నర్స్ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రసవాలకు ఇబ్బంది తలెత్తుతోంది. సిబ్బంది సరిగా లేక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి సిబ్బందిని పెంచి సరైన వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు.



ఓపీ రాయించుకుంటున్న రోగులు

రోజు 70మందికి పైగా పరీక్షలు

కొడంగల్ రూరల్: వరుస వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు దరిజేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అంగడిరాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు విద్యాప్రియ తెలిపారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులతో పాటుగా గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని పరిసర గ్రామ ప్రజలు ఏమాత్రం అనారోగ్యంతో ఇబ్బంది పడినా ఆస్పత్రికి రావాలన్నారు. ప్రతీ రోజు 70మందికి పైగా ఉచిత వైద్య పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు అందజేస్తున్నామన్నారు.



అంగడిరాయిచూర్ పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ విద్యాప్రియ



రక్త నమూనాలు సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

అవసరమైన వారికి రక్త పరీక్షలు

తాండూరు రూరల్: తాండూరు మండలానికి సంబంధించి పీహెచ్‌సీ సెంటర్ జినుగుర్తి గ్రామంలో ఉంది. ఈ పీహెచ్‌సీ కింద తొమ్మిది సబ్ సెంటర్లున్నాయి. పీహెచ్‌సీలో డాక్టర్, ల్యాబ్ టెక్నీ షియన్, ఫార్మాసిస్ట్, ఓపీ ఏఎన్ఎంలతో పాటు గ్రామాల్లో ఏఎన్ఎం, ఆశవర్కర్లు ఉన్నారు. 100 వరకు రోగులకు ఓపీలో చెక్ చేయించుకుటున్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. ఎక్కువగా తాండూరు జిల్లా ఆస్పత్రికి వెళ్తున్నారని డాక్టర్ వినోద్ తెలిపారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేస్తున్నామరు.

48 మంది సిబ్బంది.. 500 ఓపీ

పరిగి: పట్టణ కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో రోగులకు సరిపడా మందులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో మొత్తం 48 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా పది మంది డాక్టర్లు, 16 మంది నర్సులు, ఐదుగురు కార్యాలయ సిబ్బంది, 17 మంది పారామెడికల్ సిబ్బంది విధుల్లో ఉంటున్నారు. ప్రతీ రోజు 500 మంది వరకు ఓపీ వస్తున్నారు. తమకు సరైన వైద్యం అందడం లేదని పలువురు రోగులు ఆరోపించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు ఎక్కువ శాతం ప్రైవేట్ ఆస్పత్రులకు ప్రాధాన్యత ఇస్తున్నారని పలువురు వెల్లడిస్తున్నారు. కనీసం తాగునీటి వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ కేసులు వస్తున్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్ తెలిపారు.



పరిగి: క్యూలో రోగులు

9గంటలకు ముందే క్యూ..

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిలో రోగుల తాకిడి అధికంగా ఉంది. 500 వరకు ఓపీ వస్తున్నట్లు వైద్యులు వెల్లడించారు. 9గంటలకు ముందే వచ్చి ఓపీ చీటీలకు క్యూ కడుతున్నారు. సీజనల్ ప్రభావం ఉన్నందున డెంగీ కేసులు ఎక్కువగా వస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే వెంటనే రక్త పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని వైద్యులు సూచించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

48 వైరల్ ఫీవర్ కేసులు

దోమ: రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రోజు ఆస్పత్రికి 140 నుంచి 150 వరకు పేషెంట్లు హాజరవుతున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు మండల వైద్యాధికారి రజితతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో 48 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయని డాక్టర్ రజిత చెప్పారు. ఆస్పత్రికి వచ్చే వారికి కావాల్సిన మందులు అందుబాటులో ఉంటున్నాయి.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రజిత

న్యూస్‌రీల్

రేపు అథ్లెటిక్స్ సెలక్షన్స్

తాండూరు టౌన్: వికారాబాద్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న తాండూరులో జూనియర్ విభాగంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరులోని పాత శాలివాహన కళాశాల మైదానంలో ఉదయం 8 గంటల నుంచి అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు 100, 400, 800, 1500 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, షాట్‌పుట్ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే తహసీల్దార్ జారీ చేసిన ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు 8978234447, 6304089217 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేవీ రాడార్ ఏర్పాటును విరమించుకోవాలి

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

తాండూరు టౌన్: నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటును విరమించుకోవాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దామగుండం అటవీ ప్రాంతాన్ని ధ్వంసం చేసి రాడార్ స్టేషన్ ఏర్పాటు చేయడం అమానుషం అన్నారు. 12లక్షల వృక్షాలను నరికి జీవజాతులకు నీడ లేకుండా చేయడం సరికాదన్నారు. ఈ స్టేషన్ ఏర్పాటుతో వంద కిలోమీటర్ల మేర రేడియేషన్ ప్రభావం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని రక్షించాల్సిన వారే ప్రమాదకర స్టేషన్లు ఏర్పాటుకు అనుమతులివ్వడాన్ని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని విరమించుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, టీవీవీ నాయకుడు రామకృష్ణ, స్వేరోస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, బుగ్గప్ప, షకూర్, వెంకటేష్, దత్తాత్రేయ, బసంత్, బస్వరాజ్, సురేష్, రమేష్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

వయోధికుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలి

టీఏఎస్‌సీఏ జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు



లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఏఎస్‌సీఏ సభ్యులు

అనంతగిరి: ప్రభుత్వం ప్రత్యేక వయోధికుల సంక్షేమ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టీఏఎస్‌సీఏ) జిల్లా అధ్యక్షుడు మాణిక్‌ప్రభు కోరారు. ఈ మేరకు ఆయన సంఘం సభ్యులతో కలిసి అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఏజెన్సీతో నడుపుతున్న 14567కు బదులుగా 100, 104 మాదిరిగానే ప్రభుత్వ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. పురుష వయోధికులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, అన్ని ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం కల్పించాలని కోరారు. ప్రతీ జిల్లా కేంద్రంలో భవన నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి కేటాయించాలన్నారు. అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో వయోధికుల ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అప్పటి వరకు దివ్యాంగుల శాఖ చేపట్టే నామమాత్రపు కార్యక్రమాలకు దూరంగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జుకారెడ్డి, కోశాధికారి జీవన్‌కుమార్, శ్రీహరి, మొగులయ్య, విఠోబా, నారాయణరెడ్డి, మల్లయ్య, మల్లారెడ్డి, దయానంద్‌స్వామి, విఠల్, నర్సింహారెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రశాంతత

నందిగామ: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షుడు, హార్ట్‌ఫుల్‌నెస్ గ్లోబల్ గైడ్ కమ్లేష్ పటేల్ (దాజీ) అన్నారు. కన్హా శాంతి వనంలో శుక్రవారం కమ్లేష్ పటేల్ 69వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీలంక దేశానికి చెందిన అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య అదనపు సెక్రటరీ జనరల్, దలైలామా ప్రతినిధి దమింద పోరగే హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు దేశాలు, రాష్ట్రాలకు చెందిన వేలాది మంది అభ్యాసీల సమక్షంలో సామూహిక ధ్యానం చేశారు.

క్లుప్తంగా

తెలంగాణ ఉద్యమంలో సాహిత్యానిది కీలక పాత్ర



మణిపూసలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్‌: తెలంగాణ సాధనలో తెలుగు సాహిత్యం కీలక పాత్ర పోషించిందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. కవులు, రచయితలు, కళాకారులు తమ సాహిత్యం ద్వారా సమాజాన్ని జాగృతం చేశారన్నారు. గొట్టిగఖుర్దు పాఠశాలలో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన 'గొట్టిగఖుర్దు మణిపూసలు' పుస్తకావిష్కరణకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌లు మాధవరెడ్డి, బాల్‌రెడ్డి, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ అజయ్‌ప్రసాద్‌ పాల్గొన్నారు.

పెట్రోల్‌ పంపు తనిఖీ

పెట్రోల్లో నీళ్లు వస్తున్నాయి వార్తకు స్పందన



కందనెల్లి పెట్రోల్‌ పంపును తనిఖీ చేసిన సివిల్‌ సప్లయి అధికారులు

పెద్దేముల్‌: కందనెల్లి శివారులోని ఎస్సార్‌ బంకులో పెట్రోల్‌తో పాటు నీళ్లు వస్తున్నాయని సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు సివిల్‌ సప్లయి అధికారులు స్పందించారు. శుక్రవారం ఏఎస్‌ఓ ఆర్టీ నాయక్‌, డీటీ ఆసీస్‌, డీటీసీఓ గణపతిరావుతో పాటు పెద్దేముల్‌ తహసీల్దార్‌ కిషన్‌తో పాటు పలువురు అధికారులు పెట్రోల్‌ బంకును తనిఖీ చేశారు. ఆయిల్‌ కంపెనీ సేల్స్‌ ఆఫీసర్‌ రెక్టిఫై చేసిన అనంతరమే ఈ బంకు కొనసాగుతుందన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేవరకు బంకును బంద్‌ చేసి ఉంచాలన్నారు. దీనికి స్పందించిన బంకు యాజమాన్యం వర్షానికి నీళ్లు వచ్చాయని అధికారులతో వారు చెప్పుకున్నారు.

గ్రామంలో లేని ఓటర్లను తొలగించండి

బషీరాబాద్‌: రెండు దశాబ్దాలుగా గ్రామంలో లేని 89 మంది ఓటర్లు జాబితా నుంచి తొలగించాలని క్యాద్గీరా గ్రామస్తులు శుక్రవారం తహసీల్దార్‌ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలోనూ వారు గ్రామానికి రారని, అలాంటిది వారి పేర్లను ఓటరు జాబితాలో ఎలా కొనసాగిస్తారని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇదే విషయమై పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చిన బీఎల్‌ఓలు స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి వారిపేర్లను తొలగించాలని గ్రామస్తులందరు తీర్మానం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నాగేంద్రయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు చిక్కాడు

నందిగామ: అధిక వడ్డీ ఆశ చూపి, రూ.2.60 కోట్లు వసూలు చేసి.. తప్పించుకు తిరుగుతున్న ఓ వ్యక్తిని నందిగామ పోలీసులు రిమాండ్‌ తరలించారు. ఎస్‌ఐ గోపాల కృష్ణ వివరాల ప్రకారం.. మేకగూడకు చెందిన మారేపల్లి మధుసూదన్‌ 2018 నుంచి గ్రామస్తులు, తెలిసిన వారి వద్ద అప్పులు తీసుకున్నాడు. వీరికి బాండ్లు, నోట్లు రాయించి ఇచ్చాడు. కొంత కాలం పాటు క్రమం తప్పకుండా వడ్డీలు చెల్లించడంతో మిగిలిన వారు కూడా నమ్మారు. ఇలా 22 మంది నుంచి సుమారు 2.60 కోట్లు తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత చెల్లింపులు ఆపేశాడు. డబ్బు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో నగరంలోని ఛత్రినాఖకు మఖాం మార్చాడు. బాధితుల్లో ఒకరైన ప్రతాప్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లోనే మధుసూదన్‌పై కేసు నమోదైంది. తప్పించుకు తిరుగుతున్న అతన్ని ఎట్టకేలకు పట్టుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

గుంతల దారి.. ప్రయాణానికి వేసారి!

అధ్వానంగా దౌల్తాబాద్‌-బిచ్చాల రహదారి

- కొట్టుకుపోయిన కల్వర్టు, కోతకు గురైన దారి
- వాహనదారులకు తప్పని తిప్పలు



తిమ్మాయిపల్లి మలుపు వద్ద ప్రమాదకరంగా మారిన రోడ్డు



ఛిద్రమైన రోడ్డు

దౌల్తాబాద్‌: అడుగడుగునా ఏర్పడిన గుంతలతో దౌల్తాబాద్‌-బిచ్చాల రోడ్డు అధ్వానంగా మారింది. అందులో వర్షం నీరు నిలిచి మరింత దారుణంగా దాపురించింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంపై వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దౌల్తాబాద్‌, గుముడాల, తిమ్మాయిపల్లి గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాకపోకలు సాగిస్తున్న కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు సైతం దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

మూడేళ్ల నుంచి వెతలు

పదేళ్ల క్రితం దౌల్తాబాద్‌ నుంచి బిచ్చాల వరకు ఎనిమిది కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మించారు. మూడేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు గుముడాల-తిమ్మాయిపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టులు కొట్టుకుపోయి రోడ్డు కోతకు గురైంది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు సదరు మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి.

నిలిచిన ఆర్టీసీ సేవలు

దౌల్తాబాద్‌ నుంచి బిచ్చాల వరకు ఆర్టీసీ బస్సు నడిచేది. అయితే వర్షాలకు రోడ్డుపై గుంతలు ఏర్పడడం, కోతకు గురికావడంతో ఆర్టీసీ బస్సు సేవలను నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన విద్యార్థులు పాఠశాలలకు ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. అలాగే ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలన్నా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కొంతమంది తల్లిదండ్రులు ఆర్థిక స్తోమత లేక విద్యార్థులకు బడికి పంపలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు తక్షణం స్పందించి రోడ్డు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పట్టించుకోవడం లేదు



మా పిల్లలు నిత్యం చదువు కోసం దౌల్తాబాద్‌ వెళ్తారు. అయితే నెల రోజులుగా బస్సు బంద్‌ అయింది. దీంతో ఆటోలు, బండ్లపై వెళ్తున్నారు. రోడ్డు పాడైతే ఎవరూ పట్టించుకోవడంలేదు. ఏదైనా అత్యవసరమైతే చాలా ఇబ్బంది ఎదురవుతోంది.

– నర్సమ్మ, స్థానికురాలు

నిత్యం ప్రమాదాలు



గుముడాల, తిమ్మాయిపల్లి గ్రామాల మధ్యలో రోడ్డు అధ్వానంగా తయారైంది. కల్వర్టు కొట్టుకుపోయి కోతకు గురైంది. దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రమాదవశాత్తు వాహనదారులు అదుపు తప్పి పడిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించాలి.

– వీరారెడ్డి, స్థానికుడు

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- సామాజిక తనిఖీలో రూ.73వేల జరిమానా
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌



వేదికలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌

మోమిన్‌పేట: ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌ హెచ్చరించారు. మండలంలో ఉపాధి మస్టరులో హాజరు వేయడంలో నిర్లక్ష్యం, జాబ్‌ కార్డులో ఉన్న సభ్యులలో ఒకరికి బదులు ఇంకొకరు పనులు చేయడం వంటి చర్యలకు రూ.73 వేలు జరిమానా వేసినట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో 2023–24 సంవత్సరానికిగాను ఉపాధి హామీలో చేసిన పనులకు 15వ విడత సామాజిక తనిఖీ రాత్రి వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామ పంచాయితీల్లో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ కింద 716 పనులలో కూలీలకు చెల్లించిన మొత్తం రూ.6.97 కోట్లు కాగా మెటీరియల్‌ చెల్లింపులకు రూ.12.2 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. కూలీల హాజరులో అవకతవకతలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లకు రూ.73 వేలను జరిమానా విధించామన్నారు. అదేవిధంగా ఒక దగ్గర చేయాల్సిన పనికి ఇంకో దగ్గర చేయడం , జాబ్‌ కార్డులో ఉన్న సభ్యులలో ఒకరికి బదులు ఇంకొకరు హాజరు కావడం వంటి వాటికి రూ.4.33 లక్షలు రికవరీ చేయాల్సిందిగా ఆదేశించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సామాజిక తనిఖీ అధికారి దత్తు, ఎంపీడీఓ విజయలక్ష్మి, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్పీ రమేశ్‌, ఎంపీఏ యాదగిరి, ఏపీఓ శంకర్‌, ఈసీ, కార్యదర్శులు, ఫీల్డ్‌ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దూషించిన వారిని అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న దళిత నాయకులు

యాలాల: కులం పేరుతో ఓ దళిత వ్యక్తిని దూషించి, దాడికి దిగిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని దళిత సంఘం నాయకులు డిమాండ్‌ చేశారు. మండలంలోని నాగసముందర్‌లో నెలరోజుల క్రితం జరిగిన ఘటనపై సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప శుక్రవారం మాట్లాడారు. గ్రామానికి చెందిన మాల వెంకటప్ప తన పొలంలో సర్వే చేయించి హద్దురాళ్లు వేయిస్తుండగా, అదే గ్రామానికి చెందిన జోగు మల్లప్ప, జోగు వెంకటప్ప, జోగు రాములు కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇప్పటికీ అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని లేనిపక్షంలో వచ్చే నెల 10న డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, శేఖర్‌, వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలోకి తీసుకోండి

తహసీల్దార్‌కు వీఆర్‌ఏల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

తాండూరు రూరల్‌: గత ప్రభుత్వంలో వివిధ డిపార్ట్‌మెంట్‌లో సర్దుబాటు చేసిన తమని మళ్లీ రెవెన్యూ విభాగంలోకి తీసుకోవాలని వీఆర్‌ఏలు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శుక్రవారం తాండూరు తహసీల్దార్‌ తారాసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం జీవో నంబర్‌ 85 ప్రకారం వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం వెంటనే వీఆర్‌ఏలను మళ్లీ రెవెన్యూ విభాగంలోకి తీసుకురావాలని కోరారు. ఈ నెల 29న రెవెన్యూ వ్యవస్థ బలోపేతంపై తహసీల్దార్ల అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చంద్రప్ప, మున్నెప్ప, నర్సమ్మ, మహేష్‌, శరణమ్మ, రుక్మమ్మ, నర్సిములు, స్వప్న, రాజేశ్వరి పాల్గొన్నారు.

మర్రి చెట్టు.. ఆహ్లాదం పంచేట్టు





దౌల్తాబాద్‌: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో ఓ మర్రిచెట్టు ఊడలు భూమిని తాకుతున్నాయి. ఈ వృక్షానికి సుమారు 110 ఏళ్లు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చెట్టుకింద ఓ దర్గా ఉండడంతో ఏటా గంధాలతో పాటు జాతర నిర్వహిస్తుంటారు. అప్పుడప్పుడు పాఠశాల విద్యార్థులు ఇక్కడికి వచ్చి గంటల తరబడి మర్రి ఊడలపై ఊగుతూ సంతోషంగా గడుపుతుంటారని స్థానికులు తెలిపారు.

కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న శివరాజ్‌

కమలం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్‌

మోమిన్‌పేట: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజ్‌ పేర్కొన్నారు. శుక్రవారం మోమిన్‌పేటలో పార్టీ సభ్యత్వ నమోదులో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనను ప్రపంచ దేశాధినేతలే ప్రశంసిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్‌ ఒక్క ఎంపీ సీటు కూడా గెలువలేకపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ హామీలు ఇచ్చి అమలు చేయలేక పోతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన పది నెలలకే ప్రజల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటుందన్నారు. ప్రజలు బీజేపీ వైపు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, వివేకానందరెడ్డి, వడ్ల నందు, శ్రీధర్‌రెడ్డి, పాండు, భుజంగారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పని చేస్తుండగా ఫిట్స్‌..

కార్మికుడి దుర్మరణం

నందిగామ: పరిశ్రమలో పనిచేస్తున్న ఓ కార్మికుడికి ఫిట్స్‌ రావడంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మేకగూడలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ కథనం ప్రకారం .. మేకగూడ శివారులోని ఏరోలైట్‌ పరిశ్రమలో కరుణాకర్‌రెడ్డి లేబర్‌ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. కార్మికులు అవసరం ఏర్పడి ఈ నెల 20న సికింద్రబాద్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో నలుగురు కార్మికులను తీసుకొని పరిశ్రమలో పనిలో పెట్టుకున్నాడు. అందులో మధ్యప్రదేశ్‌కు చెందిన జస్వీందర్‌ సింగ్‌ భరాట్‌(30) ఉన్నాడు. గురువారం ఆయన పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు ఫిట్స్‌ రావడంతో కిందపడిపోయాడు. దీంతో పరిశ్రమ యాజమాన్యం, తోటి కార్మికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాంట్రాక్టర్‌ కరుణాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రూ.55 కోట్ల రుణ మాఫీ చేశామన్నారు. కొంత మందికి కొన్ని కారణాలతో మాఫీ కాలేదని, వ్యవసాయ అధికారులు వారి వివరాలను సేకరించారని, త్వరలోనే వారికి సైతం మాఫీ అవుతుందన్నారు. భూ సమస్యల కొరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేస్తుందన్నారు. త్వరలోనే ధరణి స్థానంలో భూమాత వస్తుందన్నారు. భూ సమస్యలు ఏవైన ఉంటే వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ ఆనంద్‌రావు, ఎంపీడీఓ ఖరీం, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంత్‌ముదిరాజ్‌, పార్టీ పట్టణ అధ్యక్షుడు కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి ఆయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి సరిపడా కుర్చీలు లేకపోవడంతో కొందరు అధికారులు నిలబడడం గమనార్హం.

గ్రామాల అభివృద్ధికి కృషి

కుల్కచర్ల: కాంగ్రెస్‌ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో రెండేళ్లుగా కొనసాగుతున్న సీసీరోడ్డు రెండో విడత పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కాంగ్రెస్‌ ప్రభుత్వం విశేష కృషిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ మొగులయ్య, పార్టీ బ్లాక్‌-బి అధ్యక్షుడు భరత్‌కుమార్‌, నాయకులు ఆంజనేయులు, గోపాల్‌నాయక్‌, హరినాథ్‌రెడ్డి, ఆనందం, వెంకటేష్‌, వెంకటయ్య, శ్రీనివాస్‌, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములు హాంఫట్‌!

- మైల్వార్‌ రిజర్వ్‌ ఫారెస్టు సరిహద్దులో కబ్జాల పర్వం
- 326 ఎకరాల్లో కన్నడ రైతుల అక్రమ సాగు
- 411 ఎకరాల్లో తెలంగాణ రైతుల పాగా



మైల్వార్‌ అటవీ భూములు



అటవీ భూమిలో సాగుచేసిన ప్రాంతాన్ని గుర్తిస్తున్న రెవెన్యూ అధికారులు

బషీరాబాద్‌: అంతర్రాష్ట్ర సరిహద్దులోని మైల్వార్‌ రిజర్వ్‌ ఫారెస్టు భూములు రోజురోజుకూ అన్యాక్రాంతమవుతున్నాయి. ఒకప్పుడు సుమారు 5 వేల ఎకరాల్లో దట్టంగా విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం ప్రస్తుతం మూడు వేల ఎకరాలకు కుంచించుకుపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పొరుగు రాష్ట్రం కర్ణాటకకు చెందిన రైతులు, స్థానికులు సుమారు 737 ఎకరాల ఫారెస్ట్‌ భూములను ఆక్రమించి సాగు చేస్తున్నట్లు సర్వేలో బయటపడింది.

అధికారుల సర్వే

జిల్లా సరిహద్దులోని బషీరాబాద్‌ మండలం కర్ణాటకకు సరిహద్దుగా ఉంది. మండలంలోని మైల్వార్‌ రిజర్వు ఫారెస్టు కింద ఉన్న అటవీ భూముల్లో పరిసర గ్రామాల, తండాల రైతులు చెట్లను నరికి యథేచ్ఛగా భూములు సాగుచేస్తున్నారు. మండలంలోని జలాల్‌పూర్‌, నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్‌, మైల్వార్‌ గ్రామాల పరిధిలోని సర్వేనంబర్‌ 69, 35, 20, 218, 235లలోని మొత్తం 737 ఎకరాలను ఆక్రమించినట్లు వారం రోజులుగా రెవెన్యూ అధికారులు నిర్వహించిన క్రెడెస్టల్‌ మ్యాప్‌ సర్వేలో వెల్లడైంది. ఇందులో తెలంగాణ రైతులు 411 ఎకరాలు సాగు చేస్తుండగా, కర్ణాటకలోని పలుగు కుచ్చతండా, కరోబార్‌తండా, గోప్యానాయక్‌తండా, బొందంపల్లితండా, ఇందిరానగర్‌, బీమ్లాతండా, హజార్‌తండా, బోయిన్‌పల్లి తండాకు చెందిన సుమారు వంద మంది రైతులు మిగిలిన భూములను ఆక్రమించినట్లు తేలింది. అయితే గతంలో ప్రభుత్వాలు అసైన్డ్‌ కింద అటవీ భూముల పంపిణీ ద్వారా 1,190 ఎకరాలను రైతులకు పట్టాలు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు నివేదికలో తెలిపారు.

కుదరని లెక్కలు

మైల్వార్‌ రిజర్వు ఫారెస్టులో 5 వేల ఎకరాలకు గాను 1,053 ఎకరాలు ఫారెస్టు భూములు ఉన్నట్లు రెవెన్యూ నివేదికలో తెలిపారు. కానీ కబ్జాకు గురైన 737 ఎకరాలు, పంపిణీ చేసిన 1,190 ఎకరాలు కలిపితే 1,927 ఎకరాలు అవుతుంది. ఈ లెక్కన 2020 ఎకరాల భూములు ఏమైనట్లో అంతు చిక్కడం లేదు. దీనిపై రెండు రాష్ట్రాల అధికారులు ఉమ్మడి సర్వే చేస్తే తప్ప భూముల లెక్కలు తేలవని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

17 మందిపై కేసు

ఇటీవల మైల్వార్‌ అటవీ భూముల్లో చెట్లు నరుకుతున్న సమాచారం వచ్చింది. అక్కడ వెళ్లి చూడగా మైల్వార్‌ తండాకు చెందిన 17 మంది భూములు సాగు చేయడానికి చెట్లు నరికివేసినట్లు గుర్తించాం. వారిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నాం. ఎవరైనా అటవీ భూముల్లో చెట్లు నరికిన, కబ్జాకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్‌ కేసులు నమోదు చేస్తాం. – స్నేహశ్రీ, ఫారెస్టు సెక్షన్‌ అధికారి

యువతకు ఆదర్శం వివేకానందుడు

రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ గురునాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్‌ రూరల్‌: వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయుడని, ప్రపంచస్థాయిలో భారతదేశ కీర్తిని ప్రసరింపజేసిన మహనీయుడని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఆర్‌.గురునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో యువజన, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విజ్ఞాన మేళా నిర్వహించారు. ఇందులో 35 పాఠశాలల విద్యార్థులు ఎక్స్‌ బిట్స్‌లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రదర్శన పాఠశాలల విద్యార్థులకు బహుమతులు అందించారు. క్లాసికల్‌ విభాగంలో మొదటి బహుమతి కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ చౌడాపూర్‌కు, రెండో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్‌ నెంబర్‌ వన్‌ పరిగికి, మాడ్రన్‌ విభాగంలో మొదటి బహుమతి అక్షర హైస్కూల్‌ తాండూర్‌కు, రెండో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్‌ బాలికల కొడంగల్‌కు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ ఉమాశంకర్‌ ప్రసాద్‌, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ ఉషారాణి, ఎంఈఓ రాంరెడ్డి, తహసీల్దార్‌ విజయకుమార్‌, జీజేసీ ప్రిన్సిపాల్‌ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.